తల్లికి వందనం ఎప్పుడిస్తారు..?



మేం కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. . మాకు ఏడుగురు పిల్లలు. నలుగురిని చదివిస్తున్నాం.ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా సహాయం అందిస్తోందని సంతోషించాం. ఎలాగోలా పిల్లల్ని చదివించుకుంటే తమ బతుకులు మారుతాయని అనుకున్నాం. ఇంతవరకు తల్లి ఖాతాలో నగదు జమ కాలేదు. పిల్లలను ఎలా చదివించుకోవాలో అర్థం కావడంలేదు.

- రేష్మ, నీలకంట్రావుపేట, రామాపురం

నిరుద్యోగ భృతి ఏమైంది..?



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం.. లేదా మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చాడు. నేటికీ దాని ఊసే ఎత్తడం లేదు. వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలి. నిరుద్యోగ భృతి వెంటనే ఇవాలి.

- దొంతిరెడ్డి హేమంత్‌రెడ్డి, కేసీ అగ్రహారం, రైల్వేకోడూరు మండలం

మహిళలకు రూ. 1500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ.1500 వెంటనే అందించాలి. ఎన్నికల హామీ మేరకు ప్రతి నెలా నగదును ప్రభుత్వం అందజేయాలి. ప్రభుత్వం వచ్చి నెలన్నర పూర్తయినా హామీ గురించి సరైన ప్రణాళికలను ఇప్పటి వరకు చెప్పకపోవడం దారుణం. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేకుంటే మహిళల ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుంది.

-పడిగల.రామలక్ష్మమ్మ, మల్లూరు, చిన్నమండెం

మూడు సిలిండర్లు ఏమయ్యాయి.?



ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తానని చెప్పడంతో గంపగుత్తగా కూటమి వైపు మొగ్గు చూపాం. ఎందుకంటే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అంటే మాలాంటి వారికి ఎంతో ఊరటనిచ్చే అంశమని విశ్వసించాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు హామీ అమలుపై ఊసే లేకపోవడం బాధ కల్గిస్తుంది. వెంటనే హామీ అమలు చేయాలి. గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి.

- పొదిలి దేవి, నందలూరు

పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వరా..?



ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు రూ.20 వేలు ఇస్తామంటే నమ్మాం. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన పెట్టుబడి సాయం ఇవ్వలేదు. దీంతో అప్పులు చేయడం ఇష్టం లేక ఈ ఏడాది పంట సాగు చేయలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా డబ్బులు ఖాతాలోకి వేసేవారు. ఎంత ఉపయోగకరంగా ఉండేంది.

- రమణ, రైతు, వడ్డిపల్లె, సంబేపల్లె మండలం

ఉచిత బస్సు ఏమైందో



ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేరుస్తామని చెప్పింది. కానీ ఇంత వరకు ఆ ఊసే ఎతడంలేదు. ఎన్నికలప్పుడు చెప్పిన హామీని నెరవేర్చాలి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి.

-జానకి, ఎస్ఎన్ కాలనీ,రాయచోటి

బాబు ష్యూరిటీ..
మోసం గ్యారెంటీ

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్




ప్రతి మహిళకు నెలకు రూ. 1500

నియోజకవర్గం	అర్హులు	నిధులు ఏడాదికి (రూ. కోట్లలో)
రాయచోటి	70985	127.7
రాజంపేట	84878	152.78
రైల్వేకోడూరు	103794	186.82



నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	అర్హులు	నిధులు ఏడాదికి (రూ. కోట్లలో)
రాయచోటి	35456	127.96
రాజంపేట	35100	126.36
రైల్వేకోడూరు	9560	34.41



'అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకం ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత బస్సుప్రయాణం కల్పించాలి



ఎన్నికల ప్రచారం కూటమి నేతలుఎన్నో హామీలను ఇచ్చారు. ఎన్నికల్లో వారే గెలిచి రెండు నెలలు కావస్తున్నా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం అమలై ఉంటే ఎంతో బాగుండేది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం.

- యామక్క, ఒంటిమిట్ట

ఉచిత సిలిండర్లంటూ టోపీ పెట్టారు



ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయాలంటే భయం వేస్తోంది అంటున్నారు. ఇది సరికాదు. వెంటనే హామీని నిలబెట్టుకోవాలి. గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా సిలిండర్లు ఇవ్వాలి.

- షేక్ షామీర్‌బాషా,ఆర్.బుదుగుంటపల్లె, రాజంపేట



టీడీపీ ఒక్కో ఏడాదికి
అన్నదాతా సుఖీభవకు కేటాయించాల్సింది

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
రాయచోటి	38729	77.45
రాజంపేట	39505	79.01
రైల్వేకోడూరు	27769	55.53



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి
తల్లికి వందనం అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
రాయచోటి	54765	82.14
రాజంపేట	48055	72.08
రైల్వేకోడూరు	38068	57.10



మహిళలకు
ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం	అర్హులు
రాయచోటి	1,69,647
రాజంపేట	96,000
రైల్వేకోడూరు	1,12,930

నోట్: ఒక మహిళ రోజూ సరాసరిగా రూ. 100 చార్జీ చెల్లిస్తుందని అంచనా



ప్రతి ఇంటికి
3 గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
రాయచోటి	87731	22.45
రాజంపేట	70407	18.01
రైల్వేకోడూరు	76717	19.63

పెట్టుబడి సాయం అందించాలి



కూటమి నేతలు ఎన్నికల సమయంలో రైతులను ఆదుకుంటామని, పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ దాని గురించి మాట్లాడటం లేదు. గతంలో ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్ అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం రైతులను మభ్యపెట్టి ఇంతవరకు ఒక రూపాయి కూడా ఇవ్వకపోవడం బాధాకరం.

- నారాయణరెడ్డి, రైతు, పుల్లంపేట

చాలా ఆశ పెట్టుకున్నాం



ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15వేలు ఇస్తామన్నారు.. మా పిల్లల చదువుకి ప్రభుత్వం ఆసరాగా ఉంటుందంటే సంతోషించాం. కొన్ని రోజుల క్రితం తల్లికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడం దారుణం. కానీ రెండు రోజుల క్రితం సంబంధిత శాఖా మంత్రి అసెంబ్లీ వేదికగా ఈ ఏడాది తల్లికి వందనం ఉండదు అని సూత్రప్రాయంగా తెలియజేయడం సిగ్గుచేటు. పిల్లలకు ఫీజులు ఎలా కట్టుకోవాలో అర్థం కావడంలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి బడికి వెళ్లే పిల్లలందరికి లబ్ధిని అందించి తల్లులకు అండగా నిలవాలి.

- మాచనూరు శిరీష, వెలుగుపల్లె, సిద్దవటం

రైతు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అందిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
రాయచోటి	40821	220
రాజంపేట	33890	183
రైల్వేకోడూరు	27794	150

అమ్మ ఒడి

గత ప్రభుత్వం అందించిన సాయం



నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ. కోట్లలో)
రాయచోటి	48426	290
రాజంపేట	35560	213
రైల్వేకోడూరు	16200	97

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు..?



ఎన్నికలు సందర్భంగా కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ ప్రగల్భాలు పలికారు. అందులో నిరుద్యోగులకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చి రెండు నెలుల పూర్తవుతున్నా ఆ ఊసే ఎత్తలేదు. ఉద్యోగాలైనా ఇవ్వండి లేకపోతే నిరుద్యోగ భృతి రూ. 3 వేలు అయినా ఇచ్చి చెప్పిన మాట నిలబెట్టుకోండి.

- బండి శ్రావణి, రాచంవాండ్లపల్లె, సుండుపల్లె

మహిళలకు నెలకు రూ.1500 అంటూ సూపర్ మోసం



చంద్రబాబు 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. రాష్ట్రంలోని 2.25 కోట్ల మంది మహిళలు పథకం అమలు కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటి వరకు పథకం అమలు కాకపోగా విధివిధానాలు కూడా అమలు చేయకపోవడం మహిళలను వంచించడమే. కుటుంబాలను నడిపేందుకు ఎంతో కొంత ప్రభుత్వం నుంచి సాయం అందుతుందంటే ఎంతో సంతోషించాం. ఇప్పుడు అమలు చేయలేమని చెప్పడం దారుణం. మహిళల ఉసురు కూటమి ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుంది. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు రాష్ట్ర ప్రజానీకాన్ని సూపర్ మోసం చేశారు.

- పల్లె మాధవి, గృహిణి, నందలూరు

ఆకేపాటి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం

రాజంపేట టౌన్ : ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నాయకత్వంలో జిల్లాలో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం వస్తుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు జెనుగు కృష్ణారావుయాదవ్, బొల్లినేని రామ్మోహన్ నాయుడులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో బుధవారం ఆకేపాటి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పార్టీ పగ్గాలు ఆకేపాటికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. సమష్టిగా ఉన్నప్పుడే మళ్లీ జగన్‌ను సీఎం చేసుకోగలమని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్.ఈశ్వరయ్య, దండు గోపి, దాసరి పెంచలయ్య, నడివీధి సుధాకర్, జీవీ సుబ్బరాజు, గోవిందు బాలకృష్ణ, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్, ఎస్.జాహీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డికి నివాళి



రాజగోపాల్ రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీపీలు

లక్కిరెడ్డిపల్లి : మాజీ మంత్రివర్యులు ఆర్.రాజగోపాల్ రెడ్డి 11వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తన తండ్రి రాజగోపాల్ రెడ్డి ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, గజమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన్ను స్మరించుకున్నారు. తన తండ్రి చేసిన సేవలను కొనియాడారు. తన వెంట నడిచిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు.

ముమ్మరంగా స్వచ్ఛతా హీ సేవా



రాజంపేట: బస్టాండ్‌లో బూజు దులుపుతున్న ఆర్టీసీ సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలు, ఆలయం పై భాగాన శుభ్రం చేశారు.

వీరబల్లి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 2కె, 5 కె పరుగు పందెంలో భాగంగా గ్రామ ప్రజలు, హైస్కూల్ పదోతరగతి విద్యార్థులు కలిసి రెండు కిలోమీటర్లు, ఐదు కిలోమీటర్ల పరుగు పందెలను నిర్వహించారు.

ఒంటిమిట్ట : స్వచ్ఛతా హీ సేవా రెండోరోజు బుధవారం ఒంటిమిట్టలోని చెత్త సంపద కేంద్రాల వద్ద గ్రీన్ అంబాసిడర్లకు ఫస్ట్ ఎయిడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం డీఎల్‌పీఓ వెంకట సుబ్బయ్య పర్యవేక్షణలో జరిగింది.

రాజంపేట : రాజంపేట ఆర్టీసీలో బుధవారం ముమ్మరంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. డిపో మేనేజరు రమణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది, అధికారులు, కార్మికులు కొత్త బస్టాండులో బూజును తొలిగించడం, చెత్త చెదారాలను లేకుండా చేశారు.

సుండుపల్లె : స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మండల కేంద్రంలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో మానవహారంగా నిలుచున్నారు. విద్యార్థులకు క్విజ్, పరుగు పందెం వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

చిన్నమండెం : మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈ నెల 14 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు వైఎస్ జగన్‌తోనే



ఎంపీటీసీ పత్తూరు ఈశ్వరమ్మకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రాణం ఉన్నంతవరకు వైఎస్ జగన్‌తోనే ఉంటానని గాదెల ఎంపీటీసీ పత్తూరి ఈశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం కొర్లకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఈశ్వరమ్మకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీకి చెందిన బీజేపీ నాయకుడు చిన్నిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి రావాల్సిన కాలనీ ఇప్పిస్తానని పిలిపించి బీజేపీ కండువాను బలవంతంగా కప్పారన్నారు. ఫొటో తీసి పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని చెప్పారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి రాజకీయంగా తనకు అవకాశం కల్పించిన వైఎస్ జగన్, ఆయన పార్టీ వెంటే నడుస్తానని స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నానని, నమ్మించి, మోసం చేసి పార్టీ కండువా కప్పడాన్ని తప్పుబట్టారు. ఎంపీటీసీ ఈశ్వరమ్మతో పాటు బంధువులు తదితరులు సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు.

సంక్షిప్తం

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దేవపట్ల ఆవులవాండ్లపల్లెలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతో కలిసి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం శక్తి వంచన లేకుండా కష్టపడాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రామాపురం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని బుధవారం నీలకంట్రావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో ఉపాధ్యాయులు పచ్చిరెడ్డి, మనోహార్, భూషణ్‌రెడ్డి, వసుందర, అమృతవల్లి, రాణి, శ్రీరాములునాయక్, రెడ్డయ్యలను ఎంఈఓల ఆధ్వర్యంలో సన్మానించారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

గాలివీడు : ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను రైతులు విధిగా ఉపయోగించుకోవాలని డీఎల్డీఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, వీఏఎస్ శివరామిరెడ్డి, రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. బుధవారం గాలివీడు మండలం అరవీడు గ్రామం శ్రీనగర్ కాలనీలో ఏపీ ఎల్డీఎల్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ చికిత్సా కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 38 పశువులకు వైద్యం చేసినట్లు తెలిపారు.

ఫ్రీ హోల్డ్ భూముల సర్వేపై దృష్టి పెట్టండి

పెనగలూరు : ఫ్రీ హోల్డ్ భూముల సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ సీహెచ్ ఇంద్రాణి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భారత జాతిని ఏకం చేసే భాష హిందీ

నందలూరు : దేశంలో ఎన్నో రకాల భాషలు ఉన్నా భారత జాతిని ఏకం చేసే భాష హిందీ అని శ్రీ అన్నమాచార్య అకాడమీ పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ హేమలతలు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన హిందీ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.

చేతిరాతపై శ్రద్ధ చూపాలి

పుల్లంపేట : ఉపాధ్యాయులు విద్యార్థులు చేతిరాతపట్ల శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ చక్రాధర్ రాజు అన్నారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

ఓబులవారిపల్లె : ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. బుధవారం వైకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆకేపాటిని కలిసిన మండల నాయకులు

ఓబులవారిపల్లె : అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆకేపాటి అమర్నాథ రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జరిగిన ఆకేపాటి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లినవారిలో మాజీ సర్పంచ్ సుంకేసుల రఫీ, డీఆర్‌సీసీయూ మాజీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ గూడురు గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి

వీరబల్లె : సెప్టెంబర్ 25న చెకుముకి సైన్స్ ట్యాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని అన్నమయ్య జిల్లా అసోసియేట్ సైన్స్ ఆఫీసర్ పల్లం రామచంద్ర తెలియజేశారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఐసీడీఎస్ అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

వీరబల్లె : అదనపు కట్నం తీసుకురావాలంటూ తన భర్త అశోక్‌కుమార్ వేధిస్తున్నాడని తనూజ అనే వివాహిత బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని జేసీ కురవపల్లికి చెందిన గోరంట్ల హనుమంతు, ఆయన కుమారుడిని అదే గ్రామానికి చెందిన పోలూరి బాబు, మరో ఇద్దరు వ్యక్తులు కొట్టి గాయపరిచినట్లు హనుమంతు చేసిన ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం శ్రీనివాసులు తెలిపారు. స్థలం తగాదా విషయంలో వీరు గొడవపడినట్లు సమాచారం.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

ఓబులవారిపల్లె : కొర్లకుంటలోని అంకాల పరమేశ్వరీదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ యువ నాయకులు తుంగా గంగాధర్ రెడ్డి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా బాలున్ని ఆశీర్వదించారు.

గిరిజన హాస్టల్ పరిశీలన

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట కళాశాలలో బుధవారం రాత్రి సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ భద్రత, ఆరోగ్యం, భోజనం, విద్య పలు అంశాలపై విద్యార్థుల వద్ద ఆరా తీశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూముల కోసం ధర్నా

రాజంపేట : నిరుపేద దళిత గిరిజనులకు ప్రభుత్వం మిగులు భూములు పంచడంలో ప్రభుత్వాలు, రెవెన్యూ అధికారులు విఫలమైయ్యారంటూ ఏపీ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో వ్యవసాయకూలీలు, దళితులు, గిరిజనులు ధర్నా బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ చాంబరు ఎదుట ఆందోళన చేపట్టారు.